

ఏర్పాట్లపై కలెక్టర్ శశాంకతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన ఎమ్మెల్యే రంగారెడ్డి


నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, ఆదివారం 14 జూలై 2024 | VIKARABAD


## 'గృహజ్యోతి' అందనివారు వివరాలను సవరించుకోవాలి

**-వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**



వికారాబాద్, జూలై 13 : గతంలో దరఖాస్తు చేసుకొని అర్హత ఉన్నా.. గృహజ్యోతి పథకం అందనివారు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో వివరాలను సవరించుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండ్లు మారినవారు, విద్యుత్తు మీటర్ యూనిక్ సర్వీస్ నంబర్ అనుసంధానం చేయకపోవడం, దరఖాస్తుల్లో తప్పులు దొర్లడం తదితర కారణాల వల్ల ప్రయోజనాలు పొందలేనివారు వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో విద్యుత్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ నంబర్, రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులతోపాటు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదును తీసుకెళ్లి వివరాలను నమోదు చేయించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక

**లష్కర్‌గూడలో 'రక్షణ కవచం కిట్లు' పంపిణీకి శ్రీకారం చుట్టనున్న సీఎం**

**సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రంగారెడ్డి, కలెక్టర్ శశాంక**

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 13 : అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని లష్కర్‌గూడకు నేడు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి రానున్నారు. బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కల్లు గీత కార్మికులకు అందించనున్న 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీకి ఆదివారం ఉదయం 11 గంటలకు ఆయన శ్రీకారం చుట్టనున్నారు. దీనికి సంబంధించిన సభ స్థలాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ శశాంక శనివారం పరిశీలించడంతోపాటు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారి వెంట ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ, సూపరింటెండెంట్ ఉజ్వలారెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఎల్బీనగర్ డీసీపీ చల్లా ప్రవీణ్‌కుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశీనాథ్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, సీఐ అంజిరెడ్డి, ఎక్సైజ్ సీఐ ధన్‌వంత్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

## ఆటో డ్రైవర్ల దీనస్థితిగతులపై నేడు తెలంగాణ భవన్‌లో సమావేశం

సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్ల దీనస్థితులపై ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ఉదయం 10:30 గంటలకు సమావేశం జరగనున్నది. ఈ మేరకు తెలంగాణ ఆటో మోటర్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల వేధింపులు, ఫైనాన్స్ బెదిరింపులు, ఉపాధి లేకుండా చేసిన కాంగ్రెస్ మోసాలపై ముఖ్య నాయకులతో చర్చించి సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని ఉధృతం చేసే కార్యాచరణ సిద్ధం చేయబోతున్నట్టు చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల ముఖ్య నాయకులు ఇందులో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలతో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇప్పటికే అనేక హామీలు ఇచ్చారని, ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు.

## నాలా భద్రతకు.. బల్దియా చర్యలు

సిటీబ్యూరో, జూలై 13(నమస్తే తెలంగాణ) : వానకాలం నేపథ్యంలో వచ్చే వరదలతో ప్రమాదాలు, వరద నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు బల్దియా అధికారులు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 1302 కిలోమీటర్ల పొడవునా వరద కాలువ ఉన్నదని, ఇందులో 390 కిలోమీటర్ల మేర మేజర్ ఉన్నట్లు తెలిపారు. వర్షాల సందర్భంలో గానీ, ఇతర సమయంలోనూ ఆస్తి, ప్రాణ, జంతు నష్టం లేకుండా అప్రమత్తంగా ఉండేందుకు నాలా భద్రతా చర్యలతో ఎంతగానో ప్రయోజనం ఉంటుందన్నారు. ఇప్పటికే వరద నాలాల వెంబడి ఉన్న ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు తావు లేకుండా మెష్, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి జోన్‌లోనూ గుర్తించిన ప్రమాద ఘంటికల వద్ద భద్రతా చర్యలు తీసుకుంటామని, సర్కిల్ పరిధిలో ఒక నిర్వహణ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ అధికారికి కొన్ని కిలోమీటర్ల బాధ్యతను అప్పగించినట్లు వివరించారు.

# 3 లక్షలు దాటింది..

## ఇప్పటివరకు 3,17,594 ఎకరాల్లో వానకాలం పంటల సాగు

- అత్యధికంగా 1.97 లక్షల ఎకరాల్లో పత్తి పంట
- 79,574 ఎకరాల్లో కంది, 14,563 ఎకరాల్లో మొక్కజొన్న..
- అన్నదాతలకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- కొనసాగుతున్న ఆన్‌లైన్‌లో పంటల వివరాల నమోదు





వికారాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): జిల్లాలో వానకాలం పంటల సాగు విస్తీర్ణం ఇప్పటివరకు మూడు లక్షల ఎకరాలు దాటింది. ఈ నెల మొదటి వారం నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఆయా పంటల సాగు జోరందుకున్నది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జిల్లా రైతాంగం పత్తి పంట సాగువైపే మొగ్గు చూపుతున్నది. ఇప్పటివరకు సాగైన ఆయా పంటల్లో 75 శాతం మేర పత్తినే సాగు చేశారు. ఈ నెలాఖరు వరకు పత్తి, కంది పంటలు సాగు చేసేందుకు అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అనంతరం సాగు చేసినట్లయితే దిగుబడిపై ప్రభావం పడే అవకాశమున్నదని సూచిస్తున్నారు. ఇక వరితోపాటు మిగతా పంటలు ఆగస్టు రెండో వారం వరకు సాగు చేసుకోవచ్చన్నారు. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా జిల్లా వ్యవసాయ శాఖ అవసరమైన చర్యలు చేపట్టింది. 20 రోజుల క్రితమే పంటల వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభంకాగా, ఇప్పటివరకు 1.50 లక్షల ఎకరాల్లోని పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

### 3,17,594 ఎకరాల్లో ఆయా పంటల సాగు..

జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 3,17,594 ఎకరాల్లో ఆయా పంటలు సాగయ్యాయి. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జిల్లా రైతాంగం పత్తి పంట సాగువైపే మొగ్గు చూపుతుండడం గమనార్హం. జిల్లాలో ఈ వానకాలంలో 5.97 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతున్నాయని జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికను రూపొందించారు. పత్తి 2,63,500 ఎకరాలు, కంది 1.50 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 50,450 ఎకరాలు, వరి 1.10 లక్షల ఎకరాలు, మినుములు 5 వేల ఎకరాలు, సోయాబీన్ 2500 ఎకరాలు, జొన్నలు-2500 ఎకరాలు, పెసర్లు 13 వేల ఎకరాల్లో సాగవుతున్నట్లు అంచనా వేశారు. ఇప్పటివరకు 3,17,594 ఎకరాల్లో ఆయా పంటలు సాగు కాగా, పత్తి-1,97,654 ఎకరాలు, వరి-2872 ఎకరాలు, మొక్కజొన్న 14,563 ఎకరాలు, కందులు-79,574 ఎకరాలు, జొన్న 922 ఎకరాలు, మినుములు-4876 ఎకరాలు, పెసర్లు 8462 ఎకరాలు, సోయాబీన్-1900 ఎకరాలు, బఠానీ-610, ఆముదం-25 ఎకరాలు, పొద్దుతిరుగుడు-2725, ధైంచా-2519 ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

### అందుబాటులో ఎరువులు..

జిల్లా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఏఈవోలు క్షేత్రస్థాయిలో పంటల సర్వే నిర్వహిస్తుండడంతో ఎరువులు, విత్తనాలు ఎంతమేర అవసరమనేది ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. యూరియా, డీఏపీ, ఎన్‌పీకేఎస్, ఎంవోపీ, ఎస్‌ఎస్‌పీ ఎరువులు అన్నీ కలిపి 75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా యూరియా 32,329 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17,719 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 19,877 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 3658 మెట్రిక్ టన్నులు, ఎస్‌ఎస్‌పీ 1854 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని సంబంధిత శాఖ అధికారులు అంచనా వేయగా, జిల్లాలో ఇప్పటివరకు యూరియా 15,317 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1273 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2477 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 192 మెట్రిక్ టన్నులు, ఎస్‌ఎస్‌పీ 106 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలోని గోదాముల్లో నిల్వ ఉంచారు. జిల్లాలో పీఏసీఎస్, డీలర్లు, కంపెనీ గోదాంలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల ద్వారానే ఎరువులు సరఫరా అవుతున్నాయి. ఎరువుల విక్రయ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండేలా జిల్లాయంత్రాంగం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. స్టాక్ పాయింట్ నుంచి జిల్లాకు ఎంత సరఫరా అయ్యింది, జిల్లాలోని స్టాక్ పాయింట్ ద్వారా ఆయా ఎరువుల దుకాణాలను ఎంతమేర ఎరువులు సరఫరా అయ్యాయనే వివరాలతోపాటు జిల్లాలోని ఎరువుల దుకాణాల నుంచి రైతులు ఎంతమేర కొనుగోలు చేశారనే పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తున్నది.

**ఈ నెలాఖరు వరకు పత్తి సాగుకు అనుకూలం...**



ఈ సీజన్‌కు సంబంధించి ఆయా పంటల సాగు విస్తృతంగా సాగుతున్నది. ఇప్పటివరకు సాగైన పంటల్లో అధికంగా పత్తి పంటనే సాగు చేశారు. ఈ నెలాఖరు వరకు పత్తి, కంది పంటలను సాగు చేసుకునేందుకు అనుకూలం. మిగతా పంటలు ఆగస్టు రెండో వారం వరకు విత్తనాలను నాటుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా సరిపడా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాం.

**- గోపాల్, వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి**

# మత్తు దించాల్సిందే..



**శివార్లలో చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి**

- విద్యార్థులే లక్ష్యంగా సాగుతున్న అమ్మకాలు
- పూర్తి స్థాయిలో ఫలితాలనివ్వని పోలీసుల చర్యలు
- ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు
- ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్, జూలై 13 : ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో గంజాయి గుప్పుమంటున్నది. ఎక్కువగా ఇంజినీరింగ్, జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉండడంతో యువత, విద్యార్థులను టార్గెట్ చేస్తూ మత్తులోకి దించుతున్నారు. దండుమైలారం, పోచారం గ్రామాల్లో అధిక సంఖ్యలో యువత గంజాయికి బానిసలుగా మారి ఇండ్లల్లో అల్లర్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దండుమైలారం గ్రామంలో గంజాయి సేవిస్తూ.. రాత్రి సమయాల్లో యువత చోరీలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల దండుమైలారం గ్రామంలో ఓ యువకుడు గంజాయి సేవించి పక్కింటి యువతిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు గ్రామంలో 144సెక్షన్ విధించి గంజాయిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో నలుగురు యువకులు గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని రిమాండ్ చేశారు. ఇటీవల మంచాల మండలంలోని ఓ గ్రామంలో గంజాయికి బానిసలుగా మారిన పలువురు యువకులు, విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సమాచారం. గంజాయి రవాణాపై పోలీసుశాఖ సీరియస్‌గా తనిఖీలు చేపడుతున్నప్పటికీ దందా మాత్రం ఆగడం లేదు. ఇటీవల నియోజకవర్గంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో పెద్ద ఎత్తున గంజాయి విక్రయదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇబ్రహీంపట్నం శివారులో గంజాయి దందా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నది. యువత అర్ధరాత్రి వరకు రోడ్లపైనే కనిపిస్తున్నారు. ప్రత్యేక అడ్డాలను ఏర్పాటు చేసుకుని రాత్రి 1గంట తర్వాత గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తున్నది. చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి దందాపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాలు కోరుతున్నాయి. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ప్రైవేటు హాస్టళ్లు ఎక్కువగా ఉండడంతో యువకులు రాత్రి సమయాల్లో గంజాయి సేవించి సాగర్‌రహదారిపై అల్లర్లు సృష్టిస్తున్నారు.

దండుమైలారం గ్రామంలో గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఇబ్రహీంపట్నం సీఐ, పోలీసు సిబ్బంది




### విద్యార్థులే టార్గెట్..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతో పాటు మహేశ్వరం, చౌటుప్పల్, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, పెద్దఅంబర్‌పేట్‌తో పాటు పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులను టార్గెట్ చేసుకుని గంజాయి వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ప్రైవేటు హాస్టళ్లల్లో ఉండే విద్యార్థులను మచ్చిక చేసుకుని ఈ రొంపిలోకి దింపుతున్నారు. కఠినంగా వ్యవహరించాల్సిన కళాశాలల యాజమాన్యాలు, పోలీసుశాఖలు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తూ ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు వసతిగృహంలో ఉండే ఓ విద్యార్థిని అడిగినప్పుడు నాతో పక్క రూంలో ఉండే విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారి రాత్రి సమయాల్లో ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. గంజాయికి బానిసలుగా మారిన విద్యార్థులు, యువత రాత్రి సమయాల్లో పరిసర ప్రాంతాల్లోని ఫాంహౌస్‌లు, విల్లాల్లో పెద్ద ఎత్తున రేవ్‌పార్టీలు నిర్వహిస్తూ గంజాయి సేవిస్తూ చిత్తవుతున్నారు.



సిగరెట్‌లోకి గంజాయి నింపుతున్న దృశ్యం



బొంగులూరు ఓఆర్ఆర్‌పై గంజాయి రవాణాపై తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)


**గంజాయి రవాణాపై స్పందించాలి..**



గంజాయి సేవిస్తున్న యువతపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గంజాయి వ్యాపారులు రెచ్చిపోతూ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇబ్రహీంపట్నం ప్రాంతంలో వసతి గృహాల్లో ఉంటూ చెడు వ్యసనాలకు అలవాటుపడుతున్నారు. పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించాలి.

**– రవణమోని జంగయ్య ముదిరాజ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు**

**గంజాయి దందాపై ఉక్కుపాదం మోపుతాం..**



గంజాయి దందాపై ఉక్కుపాదం మోపుతాం. ఇటీవల గంజాయితో పట్టుబడిన వారిని రిమాండ్ చేశాం. ప్రధాన రహదారులు, ఔటర్ రింగ్‌రోడ్డుతో పాటు అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నాం. గంజాయి సేవిస్తే వచ్చే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి సేవిస్తున్నట్లుగాని, విక్రయిస్తున్నట్లుగాని తెలిస్తే గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

**– సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం సీఐ**



అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## విద్యార్థుల భవితతో ప్రభుత్వం చెలగాటం

**కేజీబీవీ భవనం ప్రారంభించడంలో తీవ్ర జాప్యం**

**నిరసిస్తూ ఆమరణ నిరాహార దీక్షకు బీఆర్ఎస్ శ్రేణుల యత్నం అడ్డుకున్న పోలీసులు..**

**దిగొచ్చిన ప్రజాప్రతినిధులు 17న ప్రారంభిస్తామని ప్రకటన**



బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కడ్తాల్, జూలై 13 : విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కడ్తాల్‌లో కేజీబీవీ నూతన భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభించకుండా తీవ్ర జాప్యం చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఆ భవనం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు ఆమరణ దీక్ష చేయడానికి వెళ్లారు. కాగా, దీక్షకు అనుమతిలేదని పోలీసులు అడ్డుకోగా నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కేజీబీవీకి సొంత భవనం లేకపోవడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3.35 కోట్లు మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణం పూర్తయ్యి నెలలు గడుస్తున్నా ప్రారంభించడం లేదన్నారు. విద్యా సంవత్సరం పూర్తికావడంతో తప్పని పరిస్థితుల్లో ఉపాధ్యాయులు ఇక్కడి విద్యార్థినులను కందుకూరు, ఆమనగల్లు కేజీబీవీల్లో చేర్పించారన్నారు. అయితే బీఆర్ఎస్ ఆందోళన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఈ నెల 17న భవనాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారని, ఒకవేళ ఆ రోజు భవనాన్ని ప్రారంభించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ సువాళీపంతూ నాయక్, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, సులోచనాసాయిలు, పూజాదేవానాయక్, మాజీ ఎంపీటీసీలు గోపాల్, ప్రియారమేశ్‌నాయక్, నాయకులు నర్సింహ, లాయక్‌అలీ, రమణ, వెంకటేశ్, సురేశ్, లింగం, కోట్యా, శ్రీను, పాండు, రమేశ్, మహేశ్, కిషన్, గణేశ్, రాజు, అంజి, తిరుపతి, బాబా, దాస్య, శ్రీకాంత్, చందు, యాదగిరి, రామకృష్ణ, చెన్నయ్య, రతన్, జగన్, మోబీన్, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

### 17న ప్రారంభం..

కేజీబీవీ భవనాన్ని ఈ నెల 17న ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వారు స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కేజీబీవీ భవనాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, కృష్ణారావు, ఎంపీ మల్లు రవి హాజరవుతారన్నారు.